వాహనాల పార్కింగ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కురుపాం నియోజకవర్గంలో ఈనెల 28న పర్యటించనున్న సందర్భంగా నియోజకవర్గ కేంద్రానికి సమీపానున్న చినమేరంగికి వెళ్లే రహదారి సమీపాన గల మోన్ఫోర్ట్ పాఠశాల దగ్గర సభా వేదిక జరుగుతున్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్ స్థలాలల కోసం మండల కేంద్రంలో ఆఫీసల్ కాలనీ సమీపంలో ఉన్న స్థలాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని, ఇతర సౌకర్యాల కోసం క్షుణంగా పరిశీలించి ఆ స్థలం విస్తీర్ణం తదితర అంశాలు స్థానిక అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం మాదిరిగా పునరామోసం

పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసినట్టే, జిల్లాలోని టిటిపిఆర్ (తారక రామతీర్థసాగర్) ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిహారం, పునరావాసం.... నిర్వాసితుల పాలిట పరిహాసంగా మారింది. భూములు, ఊళ్లు కోల్పోయిన బాధితులకు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం, పునరావాసం అందని పరిస్థితి. భూసేకరణ విషయంలో పాలకులు 'యేరు దాటే వరకు ఓడ మల్లన్న, ఒడ్డుకు చేరాక బోడిమల్లన్న' అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై... బతుకు భారమై తల్లడిల్లుతున్నారు. నిర్వాసిత సమస్యలను అధ్యయనం చేసేందుకు గత ఏడాది జులైలో ఆర్అండ్ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

- టిటిపిఆర్ నిర్వాసితులకు అందని పరిహారం
- పునరావాసానికీ నోచుకోని దుస్థితి



తోటపల్లి ప్రాజెక్టు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2003లో తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించు కోలేకపోయారు. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడలతోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. చట్ట ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.119.1 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నేపథ్యంలో సిపిఎం, నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యాన నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధమౌతున్నారు.

విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు, జిల్లాలో నాలుగు మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీటి, 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు అవసరం కానుందని 2016లో అధికారులు అంచనా రూపొందించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల పెరిగిన ధరల నేపథ్యంలో రూ.87కోట్లు వరకూ పెరిగేందుకు అవకాశం ఉంటందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు.

సమస్యల పరిష్కారానికి నిధులు పెంచాలి

తోటపల్లి నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో నేటికీ పరిష్కారం కాలేదు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర నిధులు ఎటూ సరిపోవడం లేదు. బడ్జెట్‌లో నిధులు పెంచి రహదారులు వంటి మౌలిక వసతులను నిర్వాసిత కాలనీల్లో కల్పించాలి. ప్రధానంగా ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు చొప్పున ఇవ్వాలి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మహిళలకు కూడా వర్తింపజేయాలి.

రెడ్డివేణు
సిపిఎం జిల్లా కార్యదర్శి

నిధులు రావాల్సి ఉంది

తారకరామ తీర్థసాగర్ పరిధిలో భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన వారు 819మంది ఉన్నారు. కేవలం భూములు కోల్పోయినవారు 1398 మంది వరకు ఉన్నారు. వీరందరికీ మొత్తంగా రూ.204కోట్లు కోట్ల మేర రావాల్సివుంది. కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీచేసింది. లబ్ధిదారులకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా వచ్చింది. నిధులు విడుదల కావడమే తరువాయి. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 20 గ్రామాలకుగాను 13గ్రామాలను తరలించి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాం. మిగిలిన ఏడు గ్రామాలకు ఇంకా పునరావాసం కల్పించాల్సివుంది. అప్పట్లో మంజూరు చేసిన రూ.58వేలు సరిపోవని, ఇప్పటి ధరలకు అనుగుణంగా కనీసం రూ.3లక్షల చొప్పున ఇవ్వాలని వారు అడుగుతున్నారు.

- సుగుణాకరరావు, టిడిపిఆర్ ఎస్ఇ

గిరిజన హక్కుల రక్షణకు పోరాటం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు
14,15 తేదీల్లో గిరిజన సంఘం జిల్లా మహాసభలు

సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనుల భూమి, మౌలిక సమస్యలు పరిష్కరించాలని జులై 14,15 న కురుపాంలో జరిగే ఎపి గిరిజన సంఘం జిల్లా 7వ మహా సభలు జయప్రద చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మన్నదొరవలసలో గిరిజన సంఘం నాయకులు పి.రాము అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. తొలుత ఈ సమావేశంలో గిరిజన సంఘ జిల్లా నాయకులు, రావికోన సర్పంచ్ కె.రామస్వామి మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న 1/70 చట్టం, జీవో 3, అటవీ హక్కుల చట్టం అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించిన చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. అడవులపై గిరిజనులకు హక్కు లేకుండా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే అటవీ సంరక్షణ చట్టంలో మార్పులు తెచ్చి గిరిజనులకు అన్యాయం చేస్తుందన్నారు. దీన్ని రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా అమలు చేస్తుందని విమర్శించారు. గిరిజనులకు విద్య, వైద్యం, రోడ్డు సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలిపారు. జిల్లాలో గిరిజన సమస్యల పరిష్కారానికి చర్చించి భవిష్యత్తు ఉద్యమ పోరాటాన్ని రూపొందించేందు కురుపాంలో జులై 14, 15 తేదీల్లో గిరిజన సంఘం జిల్లా 7వ మహాసభలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ, మండల మహాసభలు జరుపుకొని భవిష్యత్ పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు

అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ చుక్కవానివలస, పుత్తూరు, సందలింగి తదితర గ్రామాల్లో పోరాడి సాగు భూములకు పట్టాలు సాధించుకున్నారని, వీరి స్ఫూర్తితో పోరాడాలని కోరారు. గిరిజన హక్కులకై పోరాడిన అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లా రైతాంగ పోరాట యోధులు కోరన్న, మంగన్న ప్రాణ త్యాగాలతో అనేకమంది నిర్బంధాలతో మన ప్రాంతంలో గిరిజనులకు భూమిపై హక్కు వచ్చింది. ఐటిడిఎ, ఆశ్రమ పాఠశాలలు కల్పించబడ్డాయని, రాజ్యాంగంలో ఐదు షెడ్యూల్లో చేర్చారన్నారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్లో చేర్చాలని, మండలంలోని సందివలస, బిల్లగుడ్డివలస, తానవలస, తొక్కుడువలస, లక్ష్మణ్ దొరవలస, పిండిలోవ, వెలగవలస తదితర గ్రామాల్లో గిరిజనులు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఏళ్ల తరబడి గిరిజన సాగులో ఉన్న డి పట్టాభూములకు ఆన్లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన పోరాటం ఉద్ధతం చేయాలని తెలిపారు. పోరాటాలకు అండగా కార్మిక సంఘాలు ఉంటాయని తెలిపారు. బోయ వాల్మీకి ఎస్టీలో చేర్చద్దని, కేంద్ర ప్రభుత్వానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం వెనక్కి తీసుకోవాలని జూన్ 28న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలనికోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బలరాం, బి.అప్పలస్వామి, లక్ష్మమ్మ, గొడవ బంగారు రాజు, వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

విద్యుత్తు ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం నాయకులు బివి రమణ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ గురువారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దొడ్డిదారిన విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను మోసగించిందని విమర్శించారు. 2014, 2020,2021, సంవత్సరాల్లో ప్రజలు వాడిన విద్యుత్‌కు మళ్లీ ఇప్పుడు సర్‌ఛార్జీ రూపంలో వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.. గత ఎన్నికల సమయంలో ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గిస్తానన్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ఏకంగా రూ.6 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపడం ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజల ఆర్థిక పరిస్థితి రోజురోజుకి దిగజారుతుందని, వ్యవసాయరంగం, చిల్లర వ్యాపార రంగాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయని, ఈ పరిస్థితుల్లో ప్రజలపై భారాలు మోపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో విస్తతంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి వెంకటనాయుడు, జగ్గారావు, గోపాలం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి అందజేశారు.

సాలూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపుతున్నాయని చెప్పారు. విద్యుత్ కోతలు ఆపాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 30న సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు టి.పోలిరాజు పాల్గొన్నారు.

వరుణుడా... కరుణించవా?

వర్షం కోసం రైతున్న ఎదురుచూపు

వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్న రైతు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వరుణుడా కరుణించవా...! వర్షాలు కురిపించవా అంటూ రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. జూన్ నెలాఖరు కావస్తున్నా వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని మేఘాల వైపు అన్నదాత ఎదురుచూస్తున్నారు. ఇప్పుడిప్పుడే రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయని తెలిపినా, ఎక్కడా చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో తొలకరి చినుకులు కురుస్తాయన్న ఉద్దేశ్యంతో పది రోజుల కిందట రైతులు వరి దుక్కులు ప్రారంభించారు. విత్తనాలు వేశారు. గత రెండు రోజులుగా ఉదయం వేళ మబ్బులతో రైతులను ఊరిస్తున్నాయి. 10 గంటలు దాటాక అధిక ఉష్ణోగ్రతలతో ఎండలు మండి పోతున్నాయి. దీంతో చెరువులు, కాలవలు అడుగుంటాయి. నీటి చుక్క కరువైంది. సకాలంలో వర్షాల కురవకుంటే ఖరీఫ్ పనులు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులు వర్షాధారంపై ఆధారపడి ప్రతి ఏటా ఖరీఫ్ సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకుంటే కరువు తప్పదు. ఇక మైదాన ప్రాంతాల్లో ఉన్న జియమ్మ వలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నా భారీగా వర్షాలు కురిస్తే గానీ పంట పొలాలకు నీరందని పరిస్థితి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతులకు వరి, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసింది. ఖరీఫ్ సాగు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నా వర్షాలు ఎప్పుడు పడతాయోనని ఆశతో ఎదురుచూస్తున్నారు.

పార్వతీపురం రూరల్ : ఖరీఫ్ పంటలను వేసుకునేందుకు రైతులు నారుమళ్లను దున్నుకొని, విత్తనాలను అందుబాటులోకి ఉంచుకొని సిద్ధంగా ఉన్నా చినుకుజాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొట్టమొదటిగా వ్యవసాయ పనులను ప్రారంభించుకొనే పార్వతీపురం మండలం రైతాంగం యావత్తు ఈ ప్రతికూల పరిస్థితుల పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించినట్లు ప్రకటించినప్పటికీ ఎక్కడా కూడా వర్షాలు కురవకపోవడంతో కనీసం నారు వేసుకునేందుకు దగ్గరలో ఉన్న చెరువులను కుంటలను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. మండలంలోని దాదాపు 15 వేల ఎకరాల్లో వరి పండించేందుకు రైతులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేసుకుని విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. అయితే చినుకుజాడ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయంపై వ్యవసాయ అధికారులు స్పందిస్తూ రైతులు ఎవరూ కూడా తొందరపడి విత్తనాలు జల్ల వద్దని, రెండు మూడు రోజులలో పూర్తిస్థాయిలో వర్షాలు పడే వాతావరణం ఉన్నందున రైతులు వేచి చూచి నారుమలలో విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. విత్తనాలను చల్లే ముందు కొద్దిగా విత్తనాలను కొద్దిరోజుల ముందు తడి గుడ్డలో మూటకట్టి పరీక్షలు నిర్వహించుకున్న అనంతరం విత్తనాలను చల్లాలని సూచిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గ్రామ రిజిస్ట్రేషన్లపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సచివాల స్థాయిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను కోరారు. మండలంలోని చిన్న బొండపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ల వ్యవస్థను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెలాఖరులోగా సచివాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగేలా ప్రోత్సహించాలని అన్నారు. తనఖాలు, సేల్ డీడ్స్, జిపిఎలు, వీలునామాలు తదితర సేవల్లో ఏదైనా రిజిస్ట్రేషన్ చేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, సర్పంచ్ గండి శంకరరావు, ఎంపిటిసి బంకురు రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విక్రయాల లక్ష్యం రూ.53.33 కోట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం డివిజన్ పరిధిలో ఈ ఏడాది అన్న వస్తువుల విక్రయాల లక్ష్యాలను అనుకున్న సమయంలోగా పూర్తి చేస్తామని, అందుకు తగిన ప్రణాళికలు తయారు చేశామని జిసిసి డిఎం యు.మహేంద్ర కుమార్ తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి ఈ ఏడాది లక్ష్యం రూ.53.33 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.7.83 కోట్లు రెండు నెలల్లో చేశామని తెలిపారు. జూన్ నెల రూ.4 కోట్లు చేస్తామన్నారు. నిత్యవసర వస్తువుల అమ్మకాలు, అటవీ ఉత్పత్తుల కొనుగోలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెంచుతావన్నారు. కొత్తగా పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాములు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా కురుపాం, కొమరాడలో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ ఏడాది గిరిజన రైతులకు వ్యవసాయ రుణాలు అనుకున్న సమయానికి అందిస్తామన్నారు. గుమ్మలక్ష్మీపురంలో కొత్తగా నిర్మిస్తున్న జిసిసి బ్రాంచి నూతన కార్యాలయం పనులు పరిశీలించారు. అనంతరం బియ్యం, గ్యాస్ గోదాములకు వెళ్లి స్టాక్ నిల్వ పరిశీలించారు.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

చదువు మధ్యలో మానేసి డ్రాపౌట్స్‌గా ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని కుడ్డపల్లి, కిల్లాడ గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ బడి బయట విద్యార్థులు ఎవరూ ఉండకూడదని, అందరూ చదువుకోవాలని అన్నారు. కుడ్డపల్లిలో 6 గురు విద్యార్థులను, కిల్లాడలో నలుగురు విద్యార్థులను, హిరమండలంలోని పూనుపేటలో నలుగురు డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి వీరందర్నీ తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. పిఒ వెంట డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్తాంవలస చేరుకున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడ - కురుపాం మధ్య సంచరిస్తున్న 8 ఏనుగుల గుంపు ఆర్తాంవలస చేరుకుందని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏనుగుల గుంపు రైల్వే పట్టాలు దాటే అవకాశం ఉందని, ఈ విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేసి రైళ్ల వేగం నియంత్రణ ముఖ్యంగా గుమడ - ఆర్తాంవలస రైల్వే గేట్ల మధ్య చేయాలని కోరినట్లు వివరించారు. ఏనుగుల పర్యవేక్షణ యూనిట్ అధికారులు రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిఎపి ప్రసూన కోరారు. ముఖ్యంగా రాత్రులు, వేకుజామున ప్రజలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సహాయ సహకారాలు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మాతా,శిశు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య కార్యాలయంలో గురువారం ఆశా నోడల్ అధికారులకు (సూపర్‌వైజర్స్) పలు ఆరోగ్య కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణీ నమోదైనప్పటి నుంచి ప్రసవం తర్వాత కొన్ని రోజుల పాటు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని అన్నారు. గర్భిణీలకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, తనిఖీలు అనంతరం అసాధారణంగా గుర్తించిన పారా మీటర్లపై దృష్టి సారించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రగతి నివేదికలు వారీగా సమీక్ష జరిపి సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణీల నమోదు, ఆయిష్మాన్ భారత్ హెల్త్ ఐడి మ్యాపింగ్, మొదటి త్రైమాసిక గర్భిణీల నమోదు, ఆరోగ్య పరీక్షలు, హై రిస్క్ గర్భిణీలను గుర్తించడం, వాటి పర్యవేక్షణ, గర్భిణీలకు టిడి టీకా రెండు డోసులు, ఐరన్ మాత్రల పంపిణీ, వాటి వివరాలు, నిర్ణీత సమయంలో అప్లోడ్ చేయడం మొదలగు అంశాలపై సమీక్ష జరిపి వైద్య సిబ్బంది ఏ మాత్రం అశ్రద్ధ చూపినా తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రసవ సమయం తేదీ దగ్గర పడుతున్న కొద్దీ గర్భిణులపై మరింత ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని, తద్వారా ఏ చిన్న ప్రమాదకర సూచనలు ఉన్న గుర్తించి, నివారిస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత పడవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిపిఒ లీలారాణి, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, హెచ్ఇ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బల్లుకోట రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

బల్లుకోట రహదారి నిర్మాణాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ పరిశీలించారు. రావాడ ఆర్అండ్‌బి రహదారి నుండి బల్లుకోట వరకు కొత్తగా రహదారి నిర్మాణం జరుగుతోంది. గురువారం ప్రాజెక్టు అధికారి పరిశీలించారు. కురుపాం మోడల్ స్కూల్ నిర్మాణ పనులు సైతం తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదులు విద్యా బోధనకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని, పనులు వేగవంతం చేసినట్లు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 313 గ్రామ సచివాలయాలు, 302 రైతు భరోసా కేంద్రాలు, 196 వై.ఎస్.ఆర్. ఆరోగ్య కేంద్రాలు నిర్మాణాలు మొదలు పెట్టడం జరిగిందని, వీటిలో 122 గ్రామ సచివాలయాలు, 84రైతు భరోసా కేంద్రాలు పూర్తి చేస్తామని అన్నారు. మిగతా పనులు త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

సృజనాత్మకతో మెరుగైన అవకాశాలు

ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

యువత మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలు, ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని సృజనాత్మకతో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువకేంద్ర, శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు గురువారం సందడిగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత తమ ప్రతిభను చాటుకుని ఆకట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని, వాటి సాధనకు నిరంతరం పరితపించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ముందుగా నేర్చుకోవాలన్న తపన ఉండాలన్నారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని బంగారు భవితకు మార్గం ఏర్పరచుకోవాలని అన్నారు. యువతలో దాగిఉన్న నిగూఢమైన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యువజనోత్సవాలు చక్కని వేదిక అన్నారు. డిపిఆర్ఒ ఎల్.రమేష్ మాట్లాడుతూ యువత పోటీతత్వం అలవర్చుకొని నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాన్ని, ప్రతిభను చాటాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు వివిధ రంగాల్లో ఉన్నతమైన స్థానంలో ఉన్న సందర్భాలను ఉదహరించి వారిలో స్ఫూర్తి నింపారు.

నృత్యం చేస్తున్న యువతులు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

యువజనోత్సవాల్లో భాగంగా యువ ఉత్సవ్ 2047 థీమ్‌లో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్ర లేఖనం, జానపద, సాంస్కృతిక నృత్యాలు, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం వంటి తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో యువత తమదైన ప్రతిభను ప్రదర్శించారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించిన నృత్యాలు అందర్నీ అలరించాయి. సృజనాత్మక రచనలో మొదటి స్థానం పి.పుణ్యవతి, రెండో స్థానం జి.గౌతమి, మూడో స్థానంలో పి.సౌమ్య, చిత్రలేఖనంలో టి.పవిత్ర, ఎస్.గౌరీ శంకర్‌రావు, మహేష్, మొబైల్ ఫొటోగ్రఫీ ఎస్.సంతోష్ కుమార్, బి.వంశీ, ఎస్.గణపతి., సాంస్కతిక జానపద కళలులో మొదటి స్థానం రాజారత్నం నాట్య మండలి, రెండో స్థానం రాధా కష్ణ బందం, మూడో స్థానం థింసా గ్రూప్‌లు విజేతలుగా నిలిచారు. హిమబిందు, గాయత్రి, రవి ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తొలుత నిర్వాహకులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బి.గౌరీశ్వరి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతి రావు, యువత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎపి గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమం పాఠశాలల్లో సీట్లు పరిమితి పెంచాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయనతో పాటు గిరిజన సంఘం నాయకులు మధు మాట్లాడుతూ ఎపి గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి గానూ 80 మంది గిరిజన విద్యార్థులకు మాత్రమే సీట్లు పరిమితం ఉండడంతో అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని అన్నారు. ఐటిడిఎ పరిధిలో గల 8 మండలాల్లో ఉన్న గురుకుల ఆశ్రమం పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి సీట్లు పెంచి గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు వెంకట్రావు, రాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ధర్మారావు కుటుంబానికి పల్లవీరాజు పరామర్శ

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని కోటిపాంకు చెందిన వై.ధర్మారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు టిడిపి నాయకులు శత్రుచర్ల పల్లవీరాజు గురువారం కొటిపాం వెళ్లి ధర్మారావు కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన ధర్మారావుకు తల్లి చెల్లి ఉన్నారు. వారిని పోషించే ధర్మారావు మృతి చెందడంతో ఆ కుటుంబానికి తీరని అన్యాయానికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వెనుక వాస్తవం పరిశీలన చేసి, పోలీస్ యంత్రాంగం నిరుపేద కుటుంబానికి ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి తవంతు సహాయ సహకారాలు అందిస్తామని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

తహాశీల్దార్ జనార్దన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల నూతన తహాశీల్దారుగా జి.వి. జనార్దన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం అర్బన్ మండలంలో డిప్యూటీ తహాశీల్దారుగా పనిచేస్తూ పదోన్నతిపై మండల తహాశీల్దారుగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన అజూరఫీ జాన్ బాడంగి తహాశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహాశీల్దార్ జీ.వి జనార్ధన్ మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

సాంబన్న వలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో సాంబాన్న వలస గ్రామంలో గురువారం శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు దిలీప్ జనరల్ మెడిసన్, తోపాటు కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుజిత్ తనిఖీలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి తనిఖీలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులను అందజేశారు. ఇందులో కంటికి సంబందించిన ఆపరేషన్లకు గుర్తించిన వారిని రాగోలు జెమ్స్ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయనున్నట్లు ఏరియా మేనేజర్ కే రమేష్ తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎంపిపి ఉరిటి రామారావు, పిఆర్ఒ అరసాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- పాలకొండ

రీసర్వే జరిగిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు అన్నారు. గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లు రీసర్వే గ్రామాల్లో ఎక్కువుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ విధంగా రైతుల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఎక్కడ ఎటువంటి సాంకేతిక ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. పక్కాగా రిజిస్ట్రేషన్లు చేపట్టాలన్నారు. ఈయన వెంట తహాశీల్దార్ సోమేశ్వరరావు, సబ్ రిజిస్టర్ కె.సత్యనారాయణ మూర్తి ఉన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డిడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-సాలూరు

పార్వతీపురం గిరిజన సంక్షేశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా సీనియర్ ఎటిడబ్ల్యుఒ కె.శ్రీనివాసరావును నియమిస్తూ గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ సిఎం రాజన్నదొర జోక్యంతో శ్రీనివాసరావు నియామకానికి మార్గం సుగమమైంది. బుధవారం కురుపాం ఎటిడబ్ల్యుఒ చంద్రబాబును నియమిస్తూ ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆదేశాలు జారీ చేయడంతో గిరిజన సంఘాలు భగ్గుమన్నాయి. దీనిపై గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధి కారులను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియమకం చేపట్టాలని ఆదేశించారు.

తహాశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

చెరువు సమస్యపై తహాశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడ రెవెన్యూ పరిధిలో గల సూరపునాయుడు చెరువు సమస్యపై సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు సమక్షంలో ఆ గ్రామ రైతులు గురువారం తహాశీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ రైతులకు నీటి ఆధారమైన సుమారు రెండు ఎకరాల విస్తీర్ణం గల సురపనాయుడు చెరువును కొంతమంది చేపల చెరువులా మార్చారన్నారు. దీంతో చెరువు దిగువనున్న రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ విషయంపై ఇరువురి మధ్య కొంత చర్చ జరిగినప్పటికీ సఫలం కాలేదన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతులు గంట తిరుపతిరావు, గంట గణపతి, సిహెచ్ సత్యనారాయణ, పలువురు ఆయకట్టు రైతులు ఉన్నారు.

ఐటిడిఎకు రెగ్యులర్ డిడిని నియమించాలి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

స్థానిక ఐటిడిఎలో రెగ్యులర్ డిడిని నియమించాలని గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఐటిడిఎ కార్యాలయంలో వినతి సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎలో ఏ అధికారి అయినా బదిలీపై వెళ్తే, ఆ స్థానంలో వేరే అధికారిని నియమించడానికి చాలా సమయం పట్టడమే కాక, రెగ్యులర్ అధికారిని కాకుండా డిప్యుటేషన్‌పై నియమించడం వల్ల గిరిజన సంక్షేమం అటకెక్కుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకర్ రావులు పాల్గొన్నారు.

స్టేట్ టాపర్‌కు పిఒ అభినందన

సీతంపేట: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్ నిలిచిన విద్యార్థిని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి గురువారం అభినందించారు. పెద్దమడి ఆశ్రమ పాఠశాలకు చెందిన గేదెల నిఖితకు ఎస్టీ కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ రావడంతో సిఎం చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలానే బాగా చదవాలని సూచించారు. చదువే అన్ని సమస్యలకు మార్గం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో డిఇ శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒ, తహాశీల్దార్, మండల, పట్టణంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి పూర్తి స్థాయిలో ప్రభుత్వం, పార్టీ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపించి 9అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా కుల, ఆదాయ, జనన, మరణ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద కొత్తగా రూపొందించిన యాప్‌లో ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో మూడు మండలాలు, మున్సిపాలిటీ అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, పార్టీ అధ్యక్షులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు ప్రతి ఒక్కరూ ప్రతి సచివాలయం పరిధిలో తప్పక పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

సాలూరు: పట్టణం లోని ప్రతి ఒక్కరూ జగనన్న సురక్షపై అవగాహన పెంచుకోవాలని జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కోరారు. పట్టణంలోని దేవరవీధి రెండో సచివాలయం, తెలంగా వీధిలోని పదో సచివాలయం పరిధిలో ఉన్న 2,3,20,21,22 వార్డుల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గిరిరఘు మాట్లాడుతూ పట్టణంలో సంక్షేమ పథకాలకు అర్హులై ఉండీ అందని వారిని గుర్తించి దరఖాస్తు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, తాడి శంకరరావు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : ఈ నెల 24 నుండి వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి జూలై 1 నుంచి జరుగు జగనన్న సురక్ష శిబిరాలు గురుంచి తెలియజేయాలని ఎంపిడిఒ ఎంపిడిఒ ఎ.రమాదేవి కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జియమ్మ వలస

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి పుట్టినరోజు వేడుకలు తన స్వగ్రామం చినమేరంగిలోని తన ఇంట్లో గురువారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు మధ్య కోలాహలంగా నిర్వహించారు. నియోజకవర్గంలో ఐదు మండలాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు నియోజకవర్గంలో గల అధికారులు ఇతరత్రా సిబ్బంది వచ్చి ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి మండలం నుండి కేకులను తీసుకువచ్చి ఎమ్మెల్యేతో కోయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు అభిమానులతో ఆమె స్వగృహం కోలాహలంగా మారింది. కార్యకర్తలు నాయకులు అభిమానుల మధ్య వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్, పుష్ప శ్రీవాణి చేత కేకును కట్ చేయించారు.

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు పాలక ప్రేమానంద్ ఆధ్వర్యంలో ఎంపిపి కె.దీనమయ్య రొట్టెలు, పండ్లు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా దోస్త్ మేరా దోస్త్ సభ్యులు మద్ది దొరబాబు రోగులకు రొట్టెలు, పాలు కొనుగోలు చేసి పంచిపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎన్ శేఖర్, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు వహీద్‌ఖాన్, జెడ్పిటిసి సభ్యులు ఎం.రాధిక, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీ శంకర్రావు, తదితరులు ఉన్నారు.

పుష్ప శ్రీవాణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జోగారావు

పార్వతీపురం టౌన్: కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం చినమేరంగి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పార్వతీపురం నియోజకవర్గం నుంచి సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం అర్బన్, రూరల్ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పిఒ కల్పనా కుమారి

గృహనిర్మాణ శాఖపై సమీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

నియోజకవర్గంలోని నాలుగు మండలాల హౌసింగ్ అధికారులతో ఆ శాఖ ప్రగతిపై ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి తన చాంబర్లో హౌసింగ్ అధికారులతో చర్చించారు. పనుల పురోగతి పెంచాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బిల్లులు త్వరితగతిన ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో డిఇ మోహన్‌రావు, నాలుగు మండలాల ఎఇలు వెంకటేష్ పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణకు చర్యలు

మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని పిఒ ఆదేశించారు. స్ప్రేయింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఫ్రైడే-డ్రైడే పక్కాగా నిర్వహించాలన్నారు. మలేరియా సిబ్బంది నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు వస్తే సంబంధిత వైద్యాధికారులు వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిఎంఒలు, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, పాల్గొన్నారు.

నవోదయకు సరస్వతీ విద్యానికేతన్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సరస్వతీ విద్యా నికేతన్‌లో చదువుతూ 2023-24 ఆరవతరగతి నవోదయ ప్రవేశ పరీక్షలో వై.సాయిసూర్య ఎంపికైంది. ఈ సందర్భంగా సరస్వతీ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎన్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాయి సూర్యకు అభినందనలు తెలిపారు.

గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలోనే ఇంటింటికి వెళ్లి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి జగన్నాథరావు అన్నారు. గురువారం మండలంలోని వెంకంపేటలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు 66 రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో వైద్యులు మంచి సేవలందిస్తున్నారని, వీటిని ప్రజలంతా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సర్పంచి తీళ్ల కృష్ణారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి : డిఐఒ

సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)లు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. గత కొద్ది రోజులుగా జిల్లా ఆసుపత్రిలోఅత్యవసర వైద్య సేవలపై సిహెచ్ఒలకు కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ప్రథమ చికిత్స, పాము, కుక్క కాటులకు చికిత్స, ఐవి ఇన్ఫ్యూషన్, అన్ని పద్ధతుల ఇంజెక్షన్లు వేయడం, గాయాలకు కుట్లు డ్రెస్సింగ్స్

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

వేయడం, తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచే నైపుణ్యం మొదలగు వాటిపై సిహెచ్ఒలు పొందిన పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు ఆయా సందర్భాల్లో ఈ అత్యవసర వైద్య సేవలు అందజేయాలని అన్నారు. తద్వారా వారి జీవన ప్రమాణం మెరుగుపడుతుందన్నారు. చికిత్స అనంతరం కొన్ని రోజుల వరకు ఆరోగ్య పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. అలాగే అత్యవసర వైద్య సేవల్లో వినియోగించే వైద్య పరికరాలు, మందులు, వాటి ఆవశ్యకతను, వినియోగించే విధానంపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిశిఖర గ్రామాలకు అత్యవసర వైద్యం, ప్రథమ చికిత్స ఆవశ్యకత మరింతగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్స్ దుర్గా ప్రసాద్, తిరుపతి రావు, ట్రైనర్స్ నీలిమ, సంతోషి లక్ష్మి , సిబ్బంది జయగౌడ్ ఉన్నారు.

అంతర పంటగా కంది లాభదాయకం

ప్రజాశక్తి - పాచిపెంట

పత్తి, మొక్కజొన్నలో అంతర, కంచె పంటగా కంది పంట సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. ప్రతి గురువారం క్షేత్ర సందర్శనలో భాగంగా మోసూరు, పాంచాలి, గురువు నాయుడుపేట రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగవుతున్న పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కంది విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వర్షానికి వర్షానికి మధ్య వ్యవధి ఎక్కువగా ఉండడం వల్ల మొక్క దశలోనే అక్కడక్కడ పత్తిపై తామర పురుగు ఆశించిందని, దీని నివారణకు ఇమిడా క్లోప్రిడ్ 10 లీటర్ల నీటికి నాలుగు మిల్లీ లీటర్ల కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే రైతులు యూరియా, డిఎపితో పాటు 15 కేజీల పొటాష్ ఎరువు కూడా వేసుకున్నట్లయితే చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని

రైతులకు సూచనలు ఇస్తున్న ఎఒ తిరుపతిరావు

తెలిపారు. పత్తి పంటలో ఎర పంటగా నేల చిక్కుడు వేసుకున్నట్లయితే రసం పీల్చు పురుగులను ముందుగానే గుర్తించవచ్చన్నారు. తద్వారా నివారణ చర్యలు చేపట్టవచ్చని అన్నారు. అలాగే ప్రతి బుధ, గురువారాల్లో తప్పనిసరిగా క్షేత్ర సందర్శనలు చేసి రైతులకు సూచనలు జారీ చేయాలని గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బందికి ఆదేశించారు. అనంతరం గురువునాయుడు పేటలో రైతులకు ఎరువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎలు బాలకృష్ణ, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

25 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో ఈ ఏడాది 3,20,000 ఎకరాల్లో ఖరీఫ్ సాగు కానుందని, మేరకు 25వేల క్వింటాళ్ల వరి సరఫరా చేయనున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ఎల్విన్‌పేట ఆర్‌బికెలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో లక్షా 71వేల ఎకరాల్లో వరి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ మేరకు రైతులకు సకాలంలో విత్తనాలను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం 25 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 90 శాతం మేరకు గిరిజనులకు అన్ని రకాల విత్తనాలను సరఫరా చేస్తున్నామని, వీటిని గిరిజనులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వరి విత్తనాలను 90 శాతం మేరకు సబ్సిడీపై రూ.8 వేలు చొప్పున సబ్సిడీ ఇస్తున్నామని అన్నారు. అలాగే కంది విత్తనాలను 32 క్వింటాలను జిల్లాలో నూరు శాతం మేరకు సబ్సిడీగా రైతులకు అందజేస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రాగి పంటను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది 87 క్వింటాళ్ల విత్తనాలను నూరు శాతం

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

సబ్సిడీపై గిరిజనులకు అందిస్తున్నామని తెలిపారు. అలాగే వేరుశనగ విత్తనాలు నూరు శాతం మేరకు సబ్సిడీతో 50 క్వింటాళ్లు అందిస్తున్నామన్నారు. వరి విత్తనాలు ఈ ఏడాది రైతులకు పలు రకాలు అందిస్తున్నామన్నారు. ఆర్‌జిఎల్ 2535 క్వింటాలు, రాగోలు సన్నాలు 1064 క్వింటాలు, ఆర్ ఎన్ ఆర్ ఐ 5048 క్వింటాలు, 34449 నెల్లూరు సన్నాలను ఈ ఏడాది రైతులకు ఖరీఫ్‌లో అందిస్తున్నామని అన్నారు. అలాగే జిల్లాలో ఉద్యానవన పంటలకు కూడా ప్రాధాన్యమిస్తూ లక్ష ఎకరాల్లో వివిధ రకాల పంటలను పండించేందుకు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నామని అన్నారు. అలాగే జిల్లాలో పత్తి పంట 15వేల ఎకరాలు, మొక్కజొన్న 15వేల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ మిల్లెట్స్ పంటలకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఆ విత్తనాలను కూడా రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రైతులకు త్వరితగతిన పంటలను పండించేందుకు అనువుగా యాంత్రీకరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు కావాల్సినవి ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రైతులకు 1043 యూనిట్లను 40 శాతం మేరకు సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాబర్ట్ పాల్ తెలిపారు. అనంతరం ఆయన ఎల్విన్ పేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సహాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు అనునిత్యం వ్యవసాయ శాఖ సహాయకులు సలహాలు, సూచనలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు వస్తే వ్యవసాయ సహాయకులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈయన వెంట మండల వ్యవసాయ అధికారి సిహెచ్. ప్రసాద్ ఉన్నారు.

తొలకరి పలకరింపు

పాలకొండ రూరల్ : పాలకొండలో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ చిరుజల్లు ఉపసమనం ఇచ్చింది.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.
పార్వతీపురం జిల్లా సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్
యస్. నాగేశ్వరరావు : 94900 99319

హక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి -బలిజిపేట

పంట సాగుదారు హక్కు పత్రాలపై గురువారం నూకలవాడ, చిలకలపల్లిలో రైతులకు డిటి కె.రత్న కుమారి, వ్యవసాయ శాఖ ఎఒ శ్రావణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగుదారు హక్కు పత్రం అనేది భూ యజమానికి, సాగుదారునికి మధ్య ఉండే ఒప్పంద పత్రమన్నారు. దీని కాలపరిమితి 11 నెలలని, సాగుదారునికి ఆ భూమిపైనా, పండించే పంట ద్వారా వచ్చిన దిగుబడి పైనా హక్కు ఉంటుందని అన్నారు. పంట రుణాలు అందుబాటు, పంటల బీమా ఉపశమనం, వడ్డీ పెట్టుబడి రాయితీ, రైతు భరోసా సాయం మొదలగు ప్రయోజనాలు రైతులకు కలుగుతాయన్నారు. దీని వల్ల భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఒప్పంద కాల పరిమితి 11 నెలలు మాత్రమే (పత్రం జారీ చేసిన తేదీ నుంచి), ఉంటుందని, గ్రామ రెవెన్యూ ఈ పత్రాలను అందిస్తారని అన్నారు. ఈ పత్రంలో భూ యజమాని పేరు, సాగుదారుని పేరు, సర్వే నెంబర్, పంట కాలం మొదలగు వివరాలు ఉంటాయన్నారు. ఏ రైతులు అయితే భూ యజమాని భూమి సాగుచేస్తున్నారో వారు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పథకాలు పూర్తిస్థాయిలో అందాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలని డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్ సూచించారు. మండల సమాఖ్య కార్యాలయంలో సిసిలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసరా మూడో విడత బయో మెట్రిక్, జగన్న తోడు డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్, మహిళా మార్ట్ సభ్యత్వం, హౌసింగ్ లోన్స్, పిఎంజెజెబివై-పిఎంఎస్‌బివై, స్త్రీనిధి రికవరీ, ఉన్నతి రికవరీ, సిఐఎఫ్ రికవరీ, విఆర్‌ఎఫ్ రికవరీ, హెచ్‌డిఐఎఫ్ రికవరీ, మొబైల్ బుక్ కీపింగ్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఆదయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ గాడి శంకరరావు S/o సింహాచలం సాలూరు, మరియు గుల్లిపల్లి విజయలక్ష్మి W/o రామక్రిష్ణ సాలూరు (2) గాడి వైశాలి W/o కిశోర్ D/o లేటు గాడి రాజనాయుడు, సాలూరు (3) గాడి సుద D/o లేటు గాడి శ్రీరాములు, సాలూరు (4) గాడి శరత్ S/o లేటు గాడి శ్రీరాములు, సాలూరు (5) దివ్వెల రమణ S/o లేటు చిన్నారావు D/o పద్మావతి సాలూరు మరియు (6) గాడి అప్పారావు S/o లేటు సింహాచలం మీరంతా నా క్లయింటుతో పాటు ఈ నోటీసులో వివరించిన షెడ్యూలు దాఖలు ఆస్తులకు వాటా దారులై యున్నారు. నేటివరకు యీ నోటీసు దాఖలా ఆస్తులను నాక్లయింటుతో పాటుగా శాశ్వత పంపకము లేకుండా, తాత్కాలిక ఎరేంజ్‌మెంట్‌లో అనుభవిస్తూయున్నారు.

కావున నాక్లయింటు తరపున యావన్మందిని కోరినది ఏమనగా యీ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తులకు సంబంధించి నాక్లయింటు యొక్క వాటా దారులతో ఏరకమైన క్రయ వ్యవహారములు జరపకూడదని మరియు నా క్లయింటు యొక్క వాటాదారులు కూడా పూర్తి పరిష్కారము కాకుండా ఏ రకమైన క్రయవ్యవహారము జరపరాదని యిందు మూలముగా తెలియజేయడమైనది. అందుకు విరుద్ధముగా వ్యవహరించినచో మీపై కోర్టు చర్యలు చేపట్టడమగునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

జిల్లా - పార్వతీపురం మన్యం, మండలం - సాలూరు, గ్రామం - సాలూరు, ఆస్తివివరము - మెట్టు, పల్లం భూములు

సర్వే నెంబర్సు & విస్తీర్ణము	
245/2 - Ac 2-01,	245/1 - Ac 4-14
244/7 - Ac 0-35,	244/6 - Ac 1-02
244/5 - Ac 0-61,	244/4 - Ac 0-56
244/3 - Ac 0-70,	244/2 - Ac 0-56
266/1 - Ac 0-34,	244/1 - Ac 2-65

మొత్తము కలిపి - Ac 12-94 సెంట్లు యీ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తి అయి ఉన్నది.

T. Jagannadha Rao
Advocate, Saluru,
Cell: 8247804627

రైలు ఢీకొని వ్యక్తి మతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొమరాడ మండలం గుమ్మడ-కూనేరు రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జిఆర్‌పి, అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలసకు చెందిన నల్లా రవీంద్ర మౌళి ట్రాక్ వద్ద ఉండగా పార్వతీపురం నుంచి రాయగడ వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో మరిపల్లిలో భారత్ గ్యాస్ ఆఫీస్ పక్కన ఒక శుభకార్యక్రమానికి మండపం వేస్తుండగా ఐరన్ పైపు విద్యుత్ వైరు తగిలి వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మరిపల్లిలో ఒక శుభ కార్యక్రమంలో మండపం ఏర్పాటు చేయడానికి రామభద్ర పురం మండలం ముచ్చెర్లవలసకు చెందిన సువ్వడ జగదీష్ (19) విద్యుత్ వైరు తగిలి కింద పడిపోయారు. స్థానికులు వెంటనే సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కేసును రూరల్ ఎస్ఐ జగదీష్ దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

అక్రమ రవాణా చేస్తున్న పశువులు పట్టివేత

సీతంపేట : బలద సంత నుండి రాజాం సంతకు అక్రమంగా రవాణా చేస్తున్న 8 పశువులను పట్టుకుని ద్వారకాతిరుమల గోసాలకు తరలించినట్టు ఎస్సై నీలకంఠరావు గురువారం తెలిపారు. వ్యాన్లో పశువులను తరలిస్తుండగా వాటికి ఎటువంటి అనుమతుల్లేవని, అక్రమంగా పశువుల తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి వ్యానును సీజ్ చేశామన్నారు.

105 మద్యం బాటిళ్లు స్వాధీనం

గరుగుబిల్లి : మండలంలోని సన్యాసిరాజుపేటలో బెల్టు షాప్ నిర్వహిస్తున్న గుడ్ల మన్మధరావు నుంచి 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు. 89 బ్రాందీ, 16 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని మేజిస్ట్రేట్ వద్దకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం షాపులు నడపడం చట్టావ్యతిరేకమని ఇలాంటి సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - సీతంపేట

అక్రమంగా వ్యాన్లో తరలిస్తున్న 2400 కేజీల పిడిఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠ రావు గురువారం తెలిపారు. దోనుబాయి నుంచి పికప్ వ్యాన్‌లో పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దోనుబాయి కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మెట్టూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బియ్యాన్ని తరలిస్తున్నారని, వీటిని పట్టుకొని కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పికప్ వ్యానును సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై గోదాముకు అప్పగించినట్టు తెలిపారు